సాక్షి
రాజన్న సిరిసిల్ల
శనివారం, 19, అక్టోబర్, 2024



ఉపశమన సంరక్షణ డే
వేములవాడఅర్బన్: ప్రపంచ ఉపశమన సంరక్షణ చికిత్స రోజు సందర్భంగా వేములవాడ ఏరియా ఆస్పత్రిలో కేక్ కట్ చేసి రోగులకు పండ్లు పంపిణీ చేశారు.



యాజమాన్యంపై కేసు పెట్టాలి
వేములవాడఅర్బన్: విద్యార్థిపై దాడి చేసిన ప్రైవేట్‌స్కూల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డీఈవోకు విన్నవించారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/25.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

మైక్రో మరుణ శాసనం



ఇతను తంగళ్లపల్లి మండలం కేసీఆర్‌నగర్‌కు చెందిన దుబాసి సాయికృష్ణ(27). డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు రావడంతో కేసీఆర్‌నగర్‌లో ఉంటున్నాడు. తన భార్య రజిత పేరిట మైక్రోఫైనాన్స్‌లో రుణం తీసుకున్నాడు. ప్రతీవారం వాయిదాలు చెల్లించేందుకు నూతి అనిల్ అనే వడ్డీ వ్యాపారి వద్ద రూ.20వేలు అప్పు చేశాడు. ఆ అప్పు సకాలంలో చెల్లించకపోవడంతో సాయికృష్ణ ఇంటికొచ్చిన అనిల్ డబ్బులు చెల్లించాలని వేధించడంతోపాటు సాయికృష్ణ సెల్ ఫోన్‌ను లాక్కొని వెళ్లాడు. ఆ అవమాన భారం భరించలేక సాయికృష్ణ ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ కేసులో అప్పు ఇచ్చి వేధించిన నూతి అనిల్ జైలుకు వెళ్లాడు. కానీ మైక్రోఫైనాన్స్ నిర్వాహకులు మాత్రం బలవంతపు వసూళ్లతో పేదలపై గద్దల్లా వాలుతూనే ఉన్నారు.



ఇతను గాజుల వేణు(45). తంగళ్లపల్లి మండలం కేసీఆర్‌నగర్‌కాలనీవాసి. వేణు వార్పర్(నేతకార్మికుడు). చేతినిండా పని ఉంటే నెలకు రూ.20వేలు సంపాదిస్తాడు. భార్య వైష్ణవి బీడీలు చేస్తుంది. వీరికి హర్షవర్ధన్, ఆరుష్ సంతానం. ఆధార్‌కార్డు తీసుకుని వైష్ణవి పేరిట ఆరు మైక్రో ఫైనాన్స్ కంపెనీలు విడతలవారీగా రూ.3లక్షల వరకు అప్పులు ఇచ్చాయి. ఆ కంపెనీలకు ప్రతీ వారం రూ.800 చొప్పున ఒక్కటి, 15 రోజులకు రూ.1,600 చొప్పున మూడు, నెలకు రూ.3,200 చొప్పున రెండు ఫైనాన్స్ కంపెనీలకు చెల్లించాలి. గతంలో వస్త్రోత్పత్తి రంగం బాగుండగా.. ఏ ఇబ్బంది లేకుండా వాయిదాలు చెల్లించాడు. కానీ ఇటీవల వస్త్రపరిశ్రమ సంక్షోభంలో ఉండడంతో పనిలేక నెలకు కట్టాల్సిన వాయిదాలు ఎల్లడం లేదు. మరోవైపు మరో రూ.10వేలు మహిళా సంఘాల్లో చెల్లించాల్సి ఉంది. తన బైక్‌ను అమ్మేసి రూ.30వేలు మైక్రో ఫైనాన్స్‌లకు చెల్లించాడు. అయినా వాళ్ల వేధింపులు తప్పకపోవడంతో వేణు ఇటీవల ఆత్మహత్యకు యత్నించగా గమనించిన కుటుంబీకులు కాపాడారు.

- కిస్తీ కట్టండి.. లేకుంటే చావండి
- సూక్ష్మరుణం.. వేధింపులు దారుణం
- సులభంగా అప్పులు.. వాయిదా కట్టకుంటే తిప్పలు
- సంక్షోభ సిరిసిల్లలో బడుగుల విలవిల
- వైఎస్సార్ హయాంలో మైక్రోవసూళ్లపై నిషేధం
- నేడు కట్టడి లేక రెచ్చిపోతున్న వైనం



సిరిసిల్ల: జిల్లాలో మైక్రోఫైనాన్స్ రుణాలు ప్రాణాలు తీస్తున్నాయి. అవసరాల కోసం రుణాలు తీసుకుంటున్న జిల్లా ప్రజలు ఆ రుణాలు చెల్లించే క్రమంలో బలైపోతున్నారు. కిస్తీలు వసూలు చేయడంలో మైక్రోఫైనాన్స్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో అవమానభారంతో ప్రాణాలు తీసుకుంటున్నారు. సిరిసిల్లలో మైక్రోఫైనాన్స్‌లు రుణం అవసరమున్న వారి ఆధార్‌కార్డు, పాన్‌కార్డుల జిరాక్స్‌లు తీసుకొని అప్పులు ఇస్తున్నాయి. సులభంగా రుణాలు ఇస్తుండడంతో కార్మికక్షేత్రంలో అప్పులు తీసుకుంటున్న వారి సంఖ్య కూడా ఎక్కువగా ఉంటుంది. ఇలా మైక్రోఫైనాన్స్‌ల వలలో వందలాది కుటుంబాలు చిక్కి విలవిలలాడుతున్నాయి.

ఇవీ మైక్రో ఫైనాన్స్‌లు

ఆర్‌బీఐ నిబంధనల మేరకు బ్యాంకులుగా రిజిస్టర్ చేయించుకుని చట్టబద్ధంగానే వ్యాపారం నిర్వహిస్తున్నట్లుగా రికార్డుల్లో చూపుతున్నాయి. సిరిసిల్లలో బంధన్‌బ్యాంకు, ఫ్యూజియన్ బ్యాంకు, ఆశీర్వాద్ బ్యాంకు, స్పందన బ్యాంకు, పిన్‌కార్‌బ్యాంకు, ఎఫ్ఎఫ్ఎల్ బ్యాంకు, ఫెడ్రోల్ బ్యాంకు రుణాలు ఇస్తున్నాయి.

అప్పులు చెల్లించాల్సిన విధానం ఇలా..

- ఒక్కో మహిళలకు తొలుత రూ.30వేలు అప్పు మంజూరు చేస్తారు. ఇందులో రూ.2వేలు బీమా కోసం, ప్రాసెసింగ్ ఫీజుగా ముందే తీసుకుని మహిళల చేతికి రూ.28వేలు ఇస్తారు. ఈ డబ్బులను వారానికి రూ.800 చొప్పున ఏడాదిపాటు చెల్లించాలి. ఇలా రూ.28వేలకు రూ.44,800 వసూలు చేస్తారు.
- రూ.40వేలు ఇస్తే.. లబ్ధిదారుల చేతికి రూ.38వేలు ఇస్తారు. 15 రోజులకోసారి రూ.950 చొప్పున రెండేళ్లపాటు చెల్లించాలి. ఇలా అధిక వడ్డీలతో మైక్రోఫైనాన్స్‌లు పేదలను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నాయి.

ఇంట్లో శవం ఉన్నా.. అప్పు చెల్లించాల్సిందే..

ఇంట్లో ఎవరైనా చనిపోయి శవమున్నా సరే మైక్రోఫైనాన్స్ వారికి వాయిదాలు చెల్లించి తీరాల్సిందే. డబ్బులు చెల్లించకుంటే ఆ గ్రూపులోని మిగతా మహిళలు వచ్చి సదరు డబ్బు చెల్లించని మహిళ ఇంటి ఎదుట కూర్చుంటారు. ఇదీ వారి కండీషన్. కిస్తీ చెల్లించకుంటే చనిపోయినా సరే అంటారు. అప్పు తీసుకున్న వారు చనిపోతే బీమా సొమ్మును రికవరీ చేసుకుంటారు.

మైక్రోభూతంపై వైఎస్సార్ ఉక్కుపాదం

2008లోనూ సిరిసిల్లలో ఇలాగే మైక్రోఫైనాన్స్ వేధింపులు ఎక్కువయ్యాయి. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మైక్రోఫైనాన్స్ వసూళ్లపై మారటోరియం విధించి, వసూళ్లను నిలిపివేశారు. బ్యాంకుల ద్వారా ఒక్కో మహిళకు రూ.50వేలకు తగ్గకుండా రుణాలు అందించారు. 1,400 సంఘాల్లోని 15వేల మంది మహిళలకు రూ.70కోట్లను ఏకకాలంలో 2009 జనవరి 1న హైదరాబాద్‌లో అందించారు. దీంతో మైక్రోఫైనాన్స్ కార్యకలాపాలు సద్దుమణిగాయి. అయితే మళ్లీ మైక్రోఫైనాన్స్ వేధింపులు మొదలయ్యాయి. వాణిజ్యబ్యాంకుల ద్వారా రుణవసతి అందకపోవడం.. ఇంటివద్దకే వచ్చి రుణాలు ఇవ్వడంతో సామన్యులు మైక్రోఫైనాన్స్‌ల వలలో చిక్కుతున్నారు.

రెండు నెలలు గడువిస్తే కడతాం



మైక్రోఫైనాన్స్‌లో అప్పులు తీసున్నాం. కానీ రోజుకో ఫైనాన్స్ వాళ్లు వచ్చి కిస్తీ చెల్లించాలని అడుగుతున్నారు. ఇచ్చేదాకా ఇంటి ముందు కూర్చుంటున్నారు. రూ.5 చొప్పున రూ.10 చొప్పున అప్పులు తెచ్చి కట్టాం. ఇప్పుడు అప్పులు పుడుత లేవు. తినేందుకు కూడా కష్టంగా ఉంది. ఇన్ని రోజులు కట్టాం. రెండు నెలలు గడువిస్తే తప్పకుండా కడతాం. – స్వరూప, కేసీఆర్‌నగర్

పనిచేసినా పైసలు వస్తలేవు



బట్టలు కుట్టినా.. బీడీలు చేసినా డబ్బులు రావడం లేదు. ఇప్పుడు పండగలు ఉన్నాయి. డబ్బులు లేక ఇబ్బందిగా ఉంది. రెండు నెలలు గడువు ఇవ్వాలంటే వేధిస్తున్నారు. ఇన్ని రోజులు బాగానే కట్టినం. ఇప్పుడు పనిచేసినా డబ్బులు రావడం లేదు. పొట్టకు ఎల్లడమే కష్టంగా ఉంది. కొద్దిగా సమయం ఇస్తే కడతాం. – రెహాన, కేసీఆర్‌నగర్

నేరుగా నన్ను కలవండి



మైక్రోఫైనాన్స్ వాళ్లు డబ్బులు చెల్లించాలని వేధిస్తే బాధితులు నేరుగా నన్ను కలవండి. తప్పకుండా అప్పుల వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తాం. అంతేకానీ అప్పుల బాధలతో ఆత్మహత్యలకు పాల్పడడం సరైన నిర్ణయం కాదు. మీపై ఆధారపడిన కుటుంబ ఏమైపోతుందో ఆలోచించండి. మైక్రో ఫైనాన్స్ బాధితులు నేరుగా నన్ను కలవండి. – సందీప్‌కుమార్ ఝా, కలెక్టర్

న్యూస్‌రీల్

వేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణానికి కృషి



పరిసరాలు పరిశీలిస్తున్న విప్ శ్రీనివాస్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్రంలో ఆధ్యాత్మిక భావన పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలోని వేణుగోపాలస్వామి ఆలయ పనులు, స్థానిక సత్సంగ సదనాన్ని ప్రభుత్వ విప్ శ్రీనివాస్ త్రిదండి రామానుజ దేవనాథజీయర్‌స్వామితో కలిసి శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. టీటీడీతోపాటు ప్రభుత్వ సహకారం అందేలా అధికారులతో చర్చిస్తామని తెలిపారు. శ్రీత్రిదండి రామానుజ దేవనాథ జీయర్ స్వామి మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో ఆలయాలను కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం నారాయణపూర్‌లోని శ్రీరామాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సాబేరాబేగం, వైస్ చైర్మన్ గుండాటి రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, బండారి బాల్‌రెడ్డి, ముత్యాల ప్రభాకర్ రెడ్డి, బొమ్మకంటి రవి, నిమ్మ మల్లారెడ్డి, సూర నర్సయ్య, మనోహరాచారి పాల్గొన్నారు.

పత్తిపాక మోహన్‌కు బాలసాహిత్య పురస్కారం

సిరిసిల్లకల్చరల్: కవి, బాలసాహిత్యకారుడు డాక్టర్ పత్తిపాక మోహన్‌ను మరో పురస్కారం వరించింది. చందమామ కథా రచయితల మాచిరాజు కామేశ్వరరావు పేరిట అందించే బాలసాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. నవంబర్ 3న హైదరాబాద్‌లో ప్రదానం చేయనున్నారు. అవార్డు కింద రూ.6వేలు నగదు, ప్రశంసాపత్రం అందజేయనున్నారు.

తెగిపడ్డ వైర్లు.. సరిచేసిన సిబ్బంది



విద్యుత్‌వైర్లను సరిచేస్తున్న విద్యుత్ సిబ్బంది

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలకేంద్రంలోని సిరిసిల్లకు వెళ్లే ప్రధాన రోడ్డుపై నయీమ్ వాటర్‌ప్లాంట్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున విద్యుత్‌తీగలు తెగిపడ్డాయి. ఆ సమయంలో అటువైపు ఎవరూ రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గమనించిన స్థానికులు విద్యుత్‌సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో లైన్‌మన్ ఎల్లయ్య, హెల్పర్లు ప్రశాంత్, బాబు వచ్చి సరిచేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక లోడ్ పడడంతోనే విద్యుత్ తీగలు తెగిపడ్డాయని సిబ్బంది తెలిపారు.

వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఎన్జీవో ప్రతినిధులు

చందుర్తి(వేములవాడ): వ్యాధులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని పద్మపాని కరీంనగర్ సొసైటీ ఎన్జీవో సంజీవ్ కోరారు. చందుర్తిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం ఎయిడ్స్, టీబీ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ ఎన్జీవో సంజీవ్, ప్రత్యేకాధికారి కల్పన, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

23న సివిల్ అసిస్టెంట్ సర్జన్ల పోస్టులకు ఇంటర్వ్యూ

సిరిసిల్లటౌన్: ఖాళీగా ఉన్న మూడు సివిల్ అసిస్టెంట్ సర్జన్ల పోస్టులకు ఈనెల 23న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సిరిసిల్ల మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎంబీబీఎస్ చదివిన వారు అర్హులు అని పేర్కొన్నారు. ఈనెల 23న సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

పాలమూరు వర్సిటీ వీసీ
జిల్లా బిడ్డే!

- డాక్టర్ జీఎన్ శ్రీనివాస్‌ను నియమించిన ప్రభుత్వం
- ఆనందం వ్యక్తం చేస్తున్న కొత్తపల్లి గ్రామస్తులు



సిరిసిల్ల: జిల్లా బిడ్డకు అరుదైన అవకాశం దక్కింది. మారుమూలపల్లెలో పుట్టిన వ్యక్తి పాలమూరు యూనివర్సిటీ వీసీ స్థాయికి ఎదిగారు. తమ గ్రామ బిడ్డ యూనివర్సిటీ స్థాయికి ఎదగడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లికి చెందిన డాక్టర్ జీఎన్ శ్రీనివాస్‌ను పాలమూరు యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీచేసింది. హైదరాబాద్ కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో సీనియర్ ప్రొఫెసర్(ఈఈఈ)గా పనిచేస్తూ.. యూజీసీ-ఎంఎంటీటీసీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌ను పాలమూరు యూనివర్సిటీ వీసీ నియమించింది. కొత్తపల్లికి చెందిన గొంద్యాల నర్సయ్య-ఎల్లవ్వ దంపతుల మూడో కొడుకు శ్రీనివాస్. వీరిది గౌరైలకాపరి కుటుంబం. నాన్న నర్సయ్య మరణించగా, తల్లి ఎల్లవ్వ కొత్తపల్లిలో ఉన్నారు. భార్య రమాదేవి గృహిణి. ఇద్దరు అమ్మాయిలు(ట్విన్స్) ఇప్పుడు ఇంటర్మీడియెట్ చదువుతున్నారు. డాక్టర్ శ్రీనివాస్‌కు పాలమూరు యూనివర్సిటీ వీసీగా అరుదైన అవకాశం దక్కింది.

సర్కారు బడిలోనే ఓనమాలు

- గంభీరావుపేట మండలం కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఓనమాలు చదువుకున్న శ్రీనివాస్ 1988లో పదోతరగతి పూర్తి చేసి కామారెడ్డి ప్రభుత్వ కాలేజీలో ఇంటర్ చదివారు.
- జేఎన్‌టీయూలో బీటెక్ ఈఈఈ చదివారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎలక్ట్రికల్ పవర్ సిస్టమ్స్‌లో ఎంఈ పూర్తి చేశారు.
- జేఎన్‌టీయూలో పవర్ సిస్టమ్ రిలియబులిటీలో పీహెచ్‌డీ చేశారు.
- 1995లో జేఎన్‌టీయూలో లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరిన శ్రీనివాస్ 1997–2003 వరకు ఓయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పదోన్నతితో విధులు నిర్వర్తించారు.

ఉపాధి కల్పించే కోర్సులు ప్రవేశపెడతాను

ఇదో మంచి అవకాశం. పెద్ద బాధ్యత కూడా. యూనివర్సిటీ అకాడమిక్ పరంగా కోర్సులను రివైజ్ చేయాల్సి ఉంటుంది. యూనివర్సిటీలో చదువుకున్న వారికి ఉపాధి కల్పించే కోర్సులను ప్రవేశపెడతాను. పాలమూరు యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌గా పారదర్శకంగా, బాధ్యతగా పనిచేసి విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేస్తాను.
– డాక్టర్ జీఎన్ శ్రీనివాస్, పాలమూరు యూనివర్సిటీ వీసీ

- 2003–2006 వరకు అసోసియేట్ ప్రొఫెసర్‌గా జేఎన్‌టీయూలో పనిచేశారు. తాను చదువుకున్న యూనివర్సిటీలోనే ప్రొఫెసర్‌గా పనిచేసే అరుదైన అవకాశం లభించింది.
- 2011 నుంచి 2020 వరకు జేఎన్‌టీయూలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. 2021 నుంచి సీనియర్ ప్రొఫెసర్‌గా కొనసాగారు. 14 మంది విద్యార్థులు శ్రీనివాస్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ చేశారు.
- తాజాగా పాలమూరు యూనివర్సిటీ వీసీగా నియమితులయ్యారు.

అపార అనుభవాలు

శ్రీనివాస్ గ్రూప్ రిక్రూట్‌మెంట్ టెస్ట్–2024కు రీజినల్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. యూజీసీ–మలేవియా మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ జేఎన్‌టీయూకు డైరెక్టర్‌గా వ్యవహరించారు. జేఎన్‌టీయూ హెచ్‌యూసీఈఆర్‌కు ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. టీఎస్‌ఎంసెట్–2017కు ప్రత్యేక పరిశీలకులుగా వ్యవహరించారు.

కాటన్ పరిశ్రమను ఆదుకోవాలి

- టెక్స్‌టైల్ ఆఫీస్ ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

సిరిసిల్లటౌన్: కాటన్ వస్త్రపరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలని పరిశ్రమ కార్మిక సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం సిరిసిల్లలోని చేనేత, జౌళిశాఖ ఆఫీస్ ఎదుట ధర్నా చేపట్టి మాట్లాడారు. గతంలో సిరిసిల్లలో కాటన్ వస్త్రపరిశ్రమతో రెండో భీవండిగా పేరొందిందన్నారు. ఒకప్పుడు ఇక్కడ 30 సైజింగ్‌లు, 30వేల పవర్‌లూమ్స్ ఉండేవని.. నేడు 10 సైజింగ్ యూనిట్లు మాత్రమే పనిచేస్తున్నాయన్నారు. వాటిలో పనిచేసే కార్మికులకు నెలకు పది రోజులు కూడా పని దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఇస్తామన్న చీరల ఆర్డర్లలో కాటన్ వస్త్రోత్పత్తికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అనంతరం చేనేత, జౌళిశాఖ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కిశోర్, యెలిగేటి రాము, సతీశ్ పాల్గొన్నారు.

నాడు రిజిస్ట్రార్.. నేడు వీసీ

ఎస్‌యూ వీసీగా ఉమేశ్‌కుమార్



వీసీ ఉమేశ్ కుమార్

కరీంనగర్ సిటీ: కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ నియామకం అయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఉమేశ్‌కుమార్ స్వస్థలం మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట. ఇప్పటివరకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కెమిస్ట్రీ విభాగాధిపతిగా కొనసాగారు. ఉమేశ్ కుమార్‌కు 28 ఏళ్ల బోధన అనుభవం, పరిశోధనల్లో 20 ఏళ్ల అనుభవం ఉంది. నల్గొండ జిల్లాలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం వీసీగా(ఐ/ఇ) (2015), రిజిస్ట్రార్‌గా కొనసాగారు. ఎస్‌యూలోనూ రెండేళ్లపాటు రిజిస్ట్రార్‌గా, యూనివర్సిటీ ఆఫ్ వెర్మోంట్, బర్లింగ్టన్, వీటి, యూఎస్‌ఏలో బయోకెమిస్ట్రీ విభాగంలో 2001–2002 సమయంలో పోస్ట్ డాక్టోరల్ అసోసియేట్‌గా పని చేశారు. పాలమూరు యూనివర్సిటీలో డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్‌గా పనిచేశారు. పలు అవార్డులు సైతం సొంతం చేసుకున్నారు. 1990లో సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, సీఎస్ఐఆర్ అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలోని ఎంఎస్సీ అప్లైడ్‌కెమిస్ట్రీ విభాగంలో మొదటి ర్యాంక్ సాధించారు. 2001 ఆగస్టులో యూఎస్ఏలోని చికాగోలో జరిగిన 222వ ఏసీఎస్ నేషనల్ మీటింగ్, ఆగస్టు 2009లో వాషింగ్టన్ డీసీలో జరిగిన 238వ ఏసీఎస్ జాతీయ సమావేశం, కొలరాడోలోని డెన్వర్‌లో జరిగిన 242 ఏసీఎస్ జాతీయ సమావేశాల్లో పాల్గొన్నారు. 2011లో అమెరికన్ కెమికల్ సొసైటీ సభ్యుడిగా పనిచేశారు. ఉస్మానియా యూనివర్సిటీలోనూ చేపట్టారు. నవంబర్ 19, 2015న రాష్ట్రపతి చేతులమీదుగా 'ఇందిరా గాంధీ జాతీయస్థాయి ఎన్ఎస్ఎస్ ట్రోఫీ' అందుకున్నారు. ప్రస్తుతం ఓయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ విభాగాధిపతిగా కొనసాగి కరీంనగర్ ఎస్‌యూ వీసీగా నియామకం అయ్యారు.

మాదకద్రవ్యాలను కట్టడి చేయండి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్

సిరిసిల్ల: జిల్లాలో మాదకద్రవ్యాలు, గంజాయిని కట్టడి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కోరారు. కలెక్టరేట్‌లో ఎస్పీ అఖిల్‌మహాజన్‌తో కలిసి శుక్రవారం జిల్లాస్థాయి నార్కో సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు జిల్లాలో సంబంధితశాఖ అధికారులను పక్కా కార్యాచరణతో కృషి చేయాలన్నారు. జిల్లాలో 525 ప్రభుత్వ పాఠశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. పిల్లలకు డ్రగ్స్‌తో కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలన్నారు. అటవీ భూములు పరిశీలించి గంజాయి సాగును నియంత్రించాలన్నారు. ఆస్పత్రులు, మెడికల్ షాపుల్లో స్టాక్ వివరాలు ప్రతి నెలా తనిఖీ చేయాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు నిఘా ఏర్పాటు చేశామని, గతేడాదిగా మాదకద్రవ్యాలకు సంబంధించి 17 కేసులు నమోదు చేసి 160 మందికి పైగా అరెస్టు చేశామన్నారు. డ్రగ్స్, గుడుంబాల సమాచారం ఉంటే కంట్రోల్ రూమ్ 87126 56426 నంబర్‌లో తెలపాలని కోరారు. సిరిసిల్ల ఆర్డీవో ఎల్.రమేశ్, ఎక్సైజ్ ఎస్పీ పంచాక్షరి, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు లక్ష్మీనారాయణ, డీఈవో రమేశ్‌కుమార్, ఇన్‌చార్జి డీఏవో రామారావు, డీఐఈవో శ్రీనివాస్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాభవాని, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆడపిల్లని తెలిస్తే.. అబార్షనే



యథేచ్ఛగా భ్రూణహత్యలు

'అమ్మ కడుపులో ఉన్నా.. బయటకొచ్చినా ప్రమాదమే.. ఆడపిల్లలంటే ఇష్టం లేదని కొందరు.. తప్పుచేసి, గర్భం దాల్చి మరికొందరు.. కారణమేదైనా పురిట్లోనే పసికందులను చిదిమేస్తున్నారు.. ఆడపిల్ల పుట్టిందని చంపిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. వివిధ కారణాలతో వచ్చినవారి అవసరాన్ని కొందరు వైద్యులు, స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు వ్యాపారంగా మలుచుకుంటున్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని తెలిసినా.. విచ్చలవిడిగా అబార్షన్లు చేస్తున్నారు.'

- హుజూరాబాద్, జమ్మికుంటలే కేంద్రాలు
- ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల నుంచి క్లయింట్స్
- మగ సంతానం కోసం 40–50 ఏళ్ల దంపతులూ బారులు
- హుజూరాబాద్ ఆస్పత్రిలో మృతపిండం అబార్షన్ చేసిందే!
- పడేసినవారిని హనుమకొండవాసులుగా గుర్తించినట్లు సమాచారం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

కడుపులో పడింది ఆడపిల్ల అని తెలిస్తే చాలు.. కొందరు తల్లిదండ్రులు కర్కశంగా వ్యవహరిస్తున్నారు. ఆ పాప లోకాన్ని చూడకముందే ప్రాణం తీసి, బయటకు విసిరేస్తున్నారు. అడ్డదారి తొక్కిన కొందరు వైద్య సిబ్బంది వల్ల లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్ కేంద్రాలు పెరిగిపోతున్నాయి. ఫలితంగా సమాజంలో బాలబాలికల నిష్పత్తిలో గణనీయ వ్యత్యాసం కనిపిస్తోంది. తాజాగా హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో లభ్యమైన 7 నెలల మృతపిండం(ఆడశిశువు) లభ్యమైంది. ఎక్కడో అబార్షన్ చేసి, ఇక్కడి దవాఖానాకు తీసుకువచ్చి పడేసి ఉంటారన్న కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. సీసీ ఫుటేజీల ద్వారా కీలక సమాచారం సేకరించి, ఓ బృందాన్ని హనుమకొండకు పంపినట్లు తెలిసింది.

రెండో సంతానం వారే 90 శాతం..

కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్, జమ్మికుంటల్లో లింగ నిర్ధారణ పరీక్షలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. హుజూరాబాద్ నియోజకవర్గం భౌగోళికంగా కరీంనగర్ జిల్లాలోనే ఉన్నప్పటికీ.. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, హనుమకొండ జిల్లాలతో సరిహద్దు పంచుకుంటోంది. ఇక్కడ వైద్య పరీక్షల్లో ఆడపిల్ల అని తెలియగానే అబార్షన్(భ్రూణహత్య) చేయడం కొంతమంది వైద్య సిబ్బందికి దందాగా మారింది. అబార్షన్ చేయించుకుంటున్న వారిలో రెండో సంతానం ఆడపిల్ల అని తెలుసుకున్న వారే 90శాతం మంది ఉంటున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్ జిల్లాల నుంచి హుజూరాబాద్, జమ్మికుంటలకు వస్తున్నారు. వీరిలో ఇదివరకే ఇద్దరు ఆడపిల్లలు ఉండి, మగ సంతానం కోసం వస్తున్న 40 నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న దంపతులు ఉండటం గమనార్హం. అప్పటికే వీరు వేసక్టమీ, ట్యూబెక్టమీ చేయించుకున్నా.. తిరిగి ఆపరేషన్ చేయించుకుంటున్నారు. ఇలాంటి వారికి ఈ రెండు ప్రాంతాలు మగపిల్లలను కనేందుకు కేంద్రాలుగా మారాయంటే అతిశయోక్తి కాదు. ఈ దందా చేసేవారికి, చేయించుకునేవారికి కొందరు ఆర్‌ఎంపీలు వారధిగా ఉంటున్నారు. గత జూన్‌లో హుస్నాబాద్ పోలీసులు ఓ ఆర్‌ఎంపీని, ప్రైవేటు ఆస్పత్రి పీఆర్వోను అరెస్టు చేసిన విషయం విదితమే.

లింగ నిష్పత్తిలో వ్యత్యాసం

అనధికార లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యల వల్ల పాత కరీంనగర్ జిల్లాలో 0–6 ఏళ్ల వయసు గల బాలబాలికల నిష్పత్తి గణనీయంగా పడిపోయింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ 1,000 మంది బాలురకు 936 మంది బాలికలే ఉన్నారు. అదే పట్టణ ప్రాంతాల్లో 932 మందే ఉన్నారు. ముఖ్యంగా రామగుండం వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో 897 మందే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే కాకుండా పొరుగు జిల్లాల్లోనూ బాలబాలికల నిష్పత్తి పడిపోవడానికి జమ్మికుంట, హుజూరాబాద్‌లలో జరుగుతున్న ఈ అక్రమ దందా కూడా ప్రధాన కారణమన్న చర్చ జరుగుతోంది.



హుజూరాబాద్ ఆస్పత్రిలో విచారణ చేస్తున్న డీసీహెచ్ డాక్టర్ చంద్రశేఖర్

హనుమకొండ మహిళగా గుర్తింపు?

హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలోని బాత్రూంలో గురువారం రాత్రి 7 నెలల మృతపిండం లభ్యమవడంపై పోలీసు విచారణ మొదలైంది. ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. శుక్రవారం డీసీహెచ్ డాక్టర్ చంద్రశేఖర్ ఈ ఘటనపై విచారణ జరిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, ఆస్పత్రి సూపరింటెండెంట్‌లను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. నివేదికను జిల్లా అధికారులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. సీసీ ఫుటేజీల ద్వారా పోలీసులు ఇప్పటికే కీలక సమాచారం సేకరించారని తెలిసింది. ఈ సంఘటనకు బాధ్యురాలైన మహిళను హనుమకొండవాసిగా గుర్తించారని, ఓ బృందాన్ని అక్కడికి పంపించినట్లు సమాచారం.

క్లుప్తంగా

స్వగ్రామానికి వలసజీవి మృతదేహం



గంభీరావుపేట(సిరిసిల్ల): దుబాయ్ నుంచి ఓ వలసజీవి మృతదేహం స్వగ్రామం చేరింది. స్థానికుల వివరాల ప్రకారం.. గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన కరువారి దేవయ్య(44) ఉపాధి నిమిత్తం 2 నెలల క్రితం దుబాయ్‌కి వెళ్లాడు. వెళ్లిన 10 రోజులకు పనిచేసే చోట ఫిట్స్ వచ్చి, కిందపడి మృతిచెందాడు. అప్పటినుంచి కుటుంబసభ్యులు మృతదేహం కోసం ఎదురు చూస్తూ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఎట్టకేలకు దేవయ్య మృతదేహం శుక్రవారం స్వగ్రామం చేరింది. కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య శ్యామల, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని కొత్తబస్టాండ్ సమీపంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు. గంభీరావుపేట మండల కేంద్రంలోని కేసీఆర్‌కాలనీకి చెందిన భాగన్నగారి లక్ష్మణ్‌గౌడ్(39) ఎల్లారెడ్డిపేటలోని రెండో బైపాస్‌రోడ్డులోని వైన్స్ పర్మిట్ రూమ్‌లో వంటమనిషిగా పనిచేసేవాడు. గురువారం రాత్రి స్వగ్రామానికి వెళ్లేందుకు బస్టాండ్‌కు నడుచుకుంటూ వచ్చి కిందపడ్డాడు. స్థానికులు ఆటోలో తరలించేందుకు ప్రయత్నించినా సహకరించలేదు. దీంతో బస్టాండ్‌లో ఉన్న ఓ పాన్‌షాప్ వెనకాల పడుకున్నాడు. అర్ధరాత్రి బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్ ఆసిఫ్‌కు సమాచారం రావడంతో వెళ్లిచూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఒక కూతురు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతితో వారు రోడ్డుమీద పడ్డారని, మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు కోరారు.

మిడ్‌మానేరులో దూకి వృద్ధురాలి ఆత్మహత్య



కనకవ్వ మృతదేహం

బోయినపల్లి(చొప్పదండి): శ్రీరాజరాజేశ్వర(మిడ్‌మానేరు) ప్రాజెక్టులో దూకి ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుందని పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. బోయినపల్లి మండలంలోని కొదురుపాకకు చెందిన కత్తెరపాక కనకవ్వ(60)కు ఆరోగ్యం బాగా లేదు. శుక్రవారం ఉదయం వేములవాడ ఆస్పత్రికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి, వెళ్లింది. తర్వాత మిడ్‌మానేరులో దూకింది. కొదురుపాక ఫోర్‌లేన్ బ్రిడ్జి పరిసరాల్లో చేపలు పడుతున్న మత్స్యకారులకు ఆమె మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని, స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతురాలి భర్త కొమురయ్య గతంలోనే మృతిచెందాడు. వీరికి ఇద్దరు కుమారులు అనిల్, అఖిల్ ఉన్నారు. సంఘటన స్థలాన్ని వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై పృథ్వీధర్ పరిశీలించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేస్తామని ఎస్సై పేర్కొన్నారు.





నేత్రపర్వంగా రథోత్సవం

గంభీరావుపేట (సిరిసిల్ల): గంభీరావుపేట మండలం లింగన్నపేటలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం నిర్వహించారు. మహిళలు మంగళహారతులు స్వామి వారికి స్వాగతం పలికారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై రథాన్ని లాగారు. నాఫ్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు దర్శించుకున్నారు.

శ్రీవారికి చక్రస్నానం





సిరిసిల్లటౌన్: పది రోజులుగా కొనసాగుతున్న శ్రీశాల శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మానేరునదిలో చక్రస్నానం నిర్వహించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించగా భక్తజనం తిలకించారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు ఉప్పుల విటల్‌రెడ్డి, తీగల శేఖర్‌గౌడ్, చేపూరి నాగరాజు, టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, ఈవో మారుతిరావు, ఏఈవో పీసరి రవీందర్, అర్చకస్వాములు కృష్ణమాచారి, వర్ధనాచారి పాల్గొన్నారు.

సెల్‌టవర్ తొలగించండి



సిరిసిల్లటౌన్: సెల్‌టవర్‌ను వెంటనే తొలగించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని సంజీవయ్యనగర్ వాసులు శుక్రవారం మున్సిపల్ ఎదుట ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ కొత్తచెరువు కట్టకు అతిసమీపంలో సెల్‌టవర్‌ను నిర్మించడంతో స్థానికులం ఇబ్బందులు పడుతున్నామన్నారు. చెరువుకట్టకు 400 మీటర్ల దూరంలో నిర్మిస్తామని అనుమతులకు దరఖాస్తు చేసి కేవలం 14 మీటర్ల దూరంలోనే నిర్మించారన్నారు. దీనిపై గతంలోనే ఫిర్యాదు చేయగా అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. సెల్‌టవర్ తొలగించే వరకు ధర్నా చేస్తామని హెచ్చరించారు. సిరిగిరి నవీన్, పెరుమాండ్ల రమేశ్, రాగుల వేణుగోపాల్, మాసం శంకర్, పెరుమాండ్ల సుప్రియ, సిరిగిరి ఆంజనేయులు పాల్గొన్నారు.

179 పోస్టులు.. 101 ఖాళీలు

- ఉమ్మడి జిల్లా వ్యవసాయ మార్కెట్లలో సిబ్బంది కరువు
- సీజనొచ్చినా.. ఉద్యోగులు లేరు
- భర్తీ మాటే మరిచిన ప్రభుత్వం
- గాడితప్పిన పాలన



కరీంనగర్ మార్కెటింగ్‌శాఖ జిల్లా కార్యాలయమిది. జిల్లా విభజనతో సిబ్బందిని ఇతర ప్రాంతాలకు సర్దుబాటు చేయడంతో కార్యాలయంలోని గదులకు తాళాలు పడ్డాయి. జిల్లా మార్కెటింగ్ అధికారి మినహా పొరుగు సేవల సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.



ఇది కరీంనగర్ వ్యవసాయ మార్కెట్లోని తూకయంత్రం. ఏటా లక్షలు వెచ్చించి మరమ్మతు చేయించడం పరిపాటిగా మారింది. రైతులు వినియోగించిన దాఖలా రెండంకెల్లోనే. రూ.20లక్షలకు పైగా మరమ్మతులకు ఖర్చు చేస్తుండగా రైతులు తూకం వేసుకుంది లేదు.



జిల్లా మార్కెటింగ్ శాఖ కార్యాలయం

కరీంనగర్ అర్బన్: వానాకాలం పంట దిగుబడుల సీజన్ మొదలైంది. పంటల కొనుగోళ్లతో కళకళలాడనున్న వ్యవసాయ మార్కెట్లు ఖాళీలతో కునారిల్లుతున్నాయి. వ్యవసాయ మార్కెట్లు రైతులకు పెద్దన్నగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వం పదేపదే స్పష్టం చేస్తున్నప్పటికీ తదనుగుణ చర్యలు కరువయ్యాయి. దశాబ్దాలుగా మార్కెటింగ్‌శాఖలో నియామకాలు లేకపోవడం శోచనీయం. పోస్టుల ఖాళీలతో వ్యవసాయ మార్కెట్లు దళారుల గుప్పిట చిక్కిశల్యమవుతున్నాయి. అన్నదాతకు అదనపు కోతలు, తూకంలో మోసాలు, విచ్చలవిడిగా సాగుతుండగా అధికార యంత్రాంగం మామూలుగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలున్నాయి. ఉమ్మడి జిల్లా మొత్తంగా 31 మార్కెట్లుండగా మొత్తం 179 పోస్టులకు 101 పోస్టులు ఖాళీగా ఉండటం వ్యవసాయ మార్కెట్ల దీనస్థితిని చాటుతోంది.

జిల్లా మార్కెటింగ్‌శాఖలో ముగ్గురే

వ్యవసాయ మార్కెట్లపై పర్యవేక్షణ, అధికారుల పనితీరు, రైతుల సమస్యలపై ఎప్పటికప్పుడు సమీక్షించాల్సిన గురుతర బాధ్యత జిల్లా మార్కెటింగ్ శాఖది. జిల్లా విభజనతో కార్యాలయం బోసిపోయింది. సదరు కార్యాలయ మంజూరు పోస్టులు పది. డీఎంవో, సీనియర్ మార్కెటింగ్ అసిస్టెంట్, రికార్డర్, టైపిస్టు, జూనియర్ ఆడిటర్లు ఒక్కొక్కరు, ఇద్దరు అటెండర్లు ఉండాలి. కానీ కార్యాలయంలో డీఎంవో, ఒక జూనియర్ ఆడిటర్, అటెండర్ మాత్రమే మిగిలారు. దీనికితోడు జోడు పదవులు పర్యవేక్షణపై ప్రభావం పడుతోంది. డీఎంవో ప్రకాశ్ జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి పురుషోత్తం గంగాధర ఇన్‌చార్జిగా ఉన్నారు. మిగతా పోస్టులన్ని ఖాళీయే. పొరుగు సేవల కింద డాటా ఎంట్రీ ఆపరేటర్ విధులు నిర్వహిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలోనూ ఇదే పరిస్థితి.

కార్యదర్శి నుంచి అటెండర్ వరకు ఖాళీలే

జిల్లా మార్కెటింగ్‌శాఖ ఖాళీలు అటుంచితే వ్యవసాయ మార్కెట్లలోనూ అదే పరిస్థితి. ఉమ్మడి జిల్లాలో 28 వ్యవసాయ మార్కెట్ యార్డులుండగా ప్రధాన మార్కెట్లలోనూ ఖాళీల కొరత వెక్కిరిస్తోంది. మార్కెట్ ఆదాయాన్ని బట్టి సెలక్షన్ గ్రేడ్, స్పెషల్ గ్రేడ్, గ్రేడ్–1, గ్రేడ్–2, గ్రేడ్–3 కార్యదర్శుల నియామకం ఉంటుండగా రూ.6కోట్ల ఆదాయం గల కరీంనగర్, జమ్మికుంట, పెద్దపల్లి మార్కెట్లకు సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి విధులు నిర్వహిస్తుంటారు. పెద్దపల్లి, కోరుట్ల, ధర్మపురి, కరీంనగర్ వ్యవసాయ మార్కెట్లో గ్రేడ్–2 కార్యదర్శి పోస్టు ఖాళీగా ఉండగా జమ్మికుంట, పెద్దపల్లి ఖాళీయే. ఇక యూడీసీ, ఎల్‌డీసీ ఖాళీ కుర్చీలే. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌లో సహాయ కార్యదర్శి, అకౌంటెంట్, పర్యవేక్షకుడు, జెఎంఎస్, డ్రైవర్, వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మానకొండూరు, గోపాల్‌రావుపేట మార్కెట్లకు కార్యదర్శులు లేకపోగా ఇన్‌చార్జీలతో నెట్టుకొస్తున్నారు. పెద్దపల్లిలో టైపిస్టు, రెండు అసిస్టెంట్ మార్కెట్ సూపర్‌వైజర్ (ఎఎంఎస్), వాచ్‌మెన్లు అయిదింటికి నాలుగు ఖాళీలుండటంతో మార్కెట్లలో పర్యవేక్షణ కరువైంది.

అడ్తిదారులు, ఖరీదుదారులదే రాజ్యం

జిల్లాల్లో ఈ– నామ్ అలంకారప్రాయమే కాగా రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. ప్రధాన మార్కెట్లలో తక్‌పట్టీల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా నగదు కోత పెట్టడం పరిపాటిగా సాగుతోంది. కరీంనగర్ మార్కెట్లోనూ ఏటా వెలుగుచూస్తున్నా చర్యలు నామమాత్రమే. వివిధ రకాల రుసుముల పేరుతో విచ్చలవిడిగా దోచుకుంటున్నారు. మార్కెట్ యార్డుల్లో పర్యవేక్షకులు, సహాయ మార్కెట్ పర్యవేక్షకులు, జూనియర్ మార్కెట్ పర్యవేక్షకుల పాత్ర కీలకం. ధాన్యం, మక్కలు, పత్తి ఇతర పంట ఉత్పత్తుల కొనుగోళ్లు, రైతులకు సౌకర్యాలు వంటివి ఎప్పటికప్పుడు పరిశీలించడం నిత్యకృత్యంగా సాగాల్సిన ప్రక్రియ. సిబ్బంది లేకపోవడం.. ఉన్న అధికారుల్లో కొందరు వీరికే దాసోహమవడం రైతన్నకు తీరని నష్టం కలుగుతుందన్న ఆరోపణలున్నాయి. ఉమ్మడి జిల్లా ఉన్నపుడు కొంత మేర ఖాళీలుండగా జిల్లా విభజన నుంచి సిబ్బందిని సర్దుబాటు చేయాల్సి వస్తోందని మార్కెటింగ్ అధికారులు వివరించారు. ఖాళీల భర్తీపై గతంలో నివేదికలు అందజేశామని, ప్రభుత్వ నిర్ణయం కోసం వేచిచూస్తున్నామని పేర్కొన్నారు.

రైతులకు ఇబ్బంది కల్గించొద్దు

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



లాల్‌సింగ్‌తండాలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

ముస్తాబాద్/ఇల్లంతకుంట/వీర్నపల్లి/గంభీరావుపేట(సిరిసిల్ల): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కల్గించొద్దని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. ముస్తాబాద్ మండలం నామాపూర్, వీర్నపల్లి మండలం లాల్‌సింగ్‌తండా, వన్‌పల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. టోకెన్ల ప్రకారం కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. టార్పాలిన్లు అందుబాటులో ఉంచామని, రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించి మద్దతు ధర పొందాలన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఆర్డీఏ పీడీ శేషాద్రి, డీసీవో రామకృష్ణ, ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి, సింగిల్‌విండో చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి, తహసీల్దార్ సురేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఏవో అనూష, వైస్‌చైర్మన్ నిమ్మల రవి, కొండల్‌రెడ్డి, వేణురెడ్డి, నర్సింలు, కరుణాకర్, రమణరెడ్డి, కుమార్, రాజిరెడ్డి, వీర్నపల్లి తహసీల్దార్ మారుతిరెడ్డి, ఎంపీడీవో రఘురాం, డీటీసీఎస్ నవీన్‌కుమార్, ఏపీఎం నర్సయ్య, ఆర్ఐ ప్రవీణ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

రైతులు ధాన్యాన్ని దళారులకు కాకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. ఇల్లంతకుంటలో కొనుగోలు కేంద్రాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ ఐరెడ్డి చైతన్య, వైస్‌చైర్మన్ ఎలగందుల ప్రసాద్, మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ, తహసీల్దార్ ఎంఏ ఫరూక్, మార్కెట్ కమిటీ కార్యదర్శి హరినాథ్, ఎంపీడీవో శశికళ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

గంభీరావుపేట మండలం కొత్తపల్లిలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ పరిశీలించారు. రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సింగిల్‌విండో చైర్మన్ భూపతి సురేందర్, డీసీవో రామకృష్ణ, తహసీల్దార్ భూపతి, సీఈవో రాజయ్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ కోరారు. ముస్తాబాద్ మండలం చీకోడు, చిప్పలపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. వ్యాపారులు, దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని కొనుగోలు కేంద్రాల్లో అమ్మి మద్దతు ధర పొందాలన్నారు.

గ్రూప్స్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఏఎస్పీ చంద్రయ్య

సిరిసిల్ల: జిల్లాలో గ్రూప్స్ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, పకడ్బందీగా సన్నద్ధంకావాలని తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి కోరారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. నవంబర్ 17, 18 తేదీల్లో నిర్వహించే గ్రూప్–3 పరీక్షలు, డిసెంబర్ 15, 16 తేదీల్లో నిర్వహించే గ్రూప్–2 పరీక్షలకు ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహేందర్‌రెడ్డి వివరించారు. జిల్లాలోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి, అవసరమైన వసతులు ఉన్నాయో? లేవో? పరిశీలించాలన్నారు. అనంతరం ఓఎమ్మార్ షీట్ల ముద్రణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. స్ట్రాంగ్‌రూమ్‌లను గుర్తించాలని, రీజినల్ కోఆర్డినేటర్లను నియమించాలని తెలిపారు. గ్రూప్–3 పరీక్షకు మూడు పేపర్లు, గ్రూప్–2కు నాలుగు పరీక్షలు ఉంటాయన్నారు. జిల్లాలో గ్రూప్–3 పరీక్షకు 25 పరీక్ష కేంద్రాల్లో 7,320 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తారని, అన్ని చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ వివరించారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, రీజినల్ కోఆర్డినేటర్ వేణుగోపాల్, కలెక్టరేట్ సెక్షన్ పర్యవేక్షకులు వేణు తదితరులు పాల్గొన్నారు.

బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంచాం



నేడు ముగింపు

సిరిసిల్ల: బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచే లక్ష్యంతో కర్రసాము శిక్షణ ఇచ్చామని హెల్పింగ్ హార్ట్స్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు కె.పున్నంచందర్ పేర్కొన్నారు. సిరిసిల్ల కళాశాల మైదానంలో కరాటే మాస్టర్ ఒడ్నాల శ్రీనివాస్ పర్యవేక్షణలో దసరా సెలవుల్లో కర్రసాము శిక్షణనిచ్చారు. పున్నంచందర్ మాట్లాడుతూ బాలికలు, యువతులు ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించే లక్ష్యంతో ఈ శిక్షణ ఇచ్చామన్నారు. మగవాళ్లకే పరిమితమైన కర్రసాము శిక్షణను బాలికలు, యువతులు ఆసక్తిగా నేర్చుకున్నారని తెలిపారు. స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అల్వాల ఈశ్వర్ మాట్లాడుతూ 15 రోజులపాటు ఉచితంగా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

కర్రసాము శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని శనివారం సాయికృష్ణ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ అఖిల్ మహాజన్, సీనియర్ సివిల్ జడ్జి రాధికా జైస్వాల్, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, డిస్ట్రిక్ట్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ కమటం అంజయ్య హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. శిక్షణలో ప్రతిభ చూపిన వారికి మెడల్స్ ప్రదానం చేయనున్నారు.

గంజివాగు కష్టాలు తీరేదెప్పుడో?

- కలెక్టర్ ఆదేశించినా పనుల్లో కదలిక కరువు
- వర్షాలు తగ్గినా మొదలుకాని స్లాబ్ పనులు
- ఏడాదిగా సాగుతున్న బ్రిడ్జి నిర్మాణం
- అగ్రిమెంట్ గడువు ముగిసి ఏడు నెలలు



స్లాబ్ నిర్మాణం లేక కనిపిస్తున్న గంజివాగు హై లెవల్ బ్రిడ్జి

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని గంజివాగుపై వంతెన పనులు నత్తకు నడక నేర్పేలా సాగుతున్నాయి. ఏడాది క్రితం ప్రారంభమైన పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. గత ఆగస్టులో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సైతం తనిఖీ చేసి పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. అయినా హైలెవల్ వంతెన పనుల్లో కదలిక లేదు. ఫలితంగా వంతెన పూర్తికాకపోవడంతో చిన్నపాటి వర్షానికి తాత్కాలికంగా పోసిన మట్టిరోడ్డు కొట్టుకుపోతుండడంతో బోయినపల్లి–వేములవాడల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి.

రూ.1.80కోట్లతో పనులు

బోయినపల్లి–వేములవాడ ప్రధాన రహదారిపై బోయినపల్లి మండలం స్తంభంపల్లి గంజివాగు కల్వర్టు స్థానంలో రూ.1.80కోట్ల అంచనాలతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి 2023 జూలైలో నిధులు మంజూరు చేశారు. 2023 ఆగస్టు 29న వంతెన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఏడాది గడిచినా పిల్లర్లపై స్లాబ్‌లు వేయకపోవడంతో పనులు అసంపూర్తిగానే మిగిలాయి. 2024 మార్చి వరకే పనుల అగ్రిమెంట్ గడువు పూర్తయింది. వర్షాకాలంలో పనులు చేయరాదనే నెపంతో స్లాబ్ పనులు నిలిపివేశారు. ప్రస్తుతం వర్షాలు లేవు. అయినా పనులు మొదలుపెట్టలేదు.

వర్షాకాలంలో ప్రయాణం నరకం

హై లెవల్ బ్రిడ్జి పనులు పూర్తి కాకపోవడంతో ఈ ఏడాది వర్షాకాలంలో ప్రయాణికులకు బ్రిడ్జి పరిసరాల్లో ప్రయాణం నరకప్రాయంగా మారింది. అక్కడ వేసిన తాత్కాలిక మట్టిరోడ్డు ఈ వర్షాకాలంలో మూడుసార్లు తెగిపోయింది. ప్రతీసారి వాహనదారులు అయ్యోరుపల్లి, రామన్నపేట, దేశాయిపల్లి మీదుగా 5 కిలోమీటర్ల మేర అదనపు దూరం ప్రయాణించి ఇటు బోయినపల్లి, అటు వేములవాడకు చేరుకున్నారు.

స్లాబ్ పనులు చేపడతాం



స్తంభంపల్లి హై లెవల్ బ్రిడ్జి స్లాబ్ నిర్మాణం పనులు మరో 15 రోజుల్లో ప్రారంభించేలా చూస్తాం. పనులు త్వరగా ప్రారంభించాలని కాంట్రాక్టర్‌కు చెప్పాం. వర్షాలు కురవడంతోనే స్లాబ్ నిర్మాణ పనులు జరుగలేదు. త్వరగా పనులు జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– కె.విష్ణువర్ధన్, పీఆర్, ఏఈ, బోయినపల్లి.

పెండింగ్ బిల్లులు చెల్లించే దాకా పోరాడుతాం

- అభివృద్ధి చేసి అప్పుల పాలయ్యాం
- రోడ్డెక్కిన తాజా మాజీ సర్పంచులు
- సిరిసిల్లలో తాజా మాజీ సర్పంచుల జేఏసీ దీక్షలు
- నేటి నుంచి మండల కేంద్రాల్లోనూ..



సిరిసిల్ల అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న తాజా మాజీ సర్పంచులు

సిరిసిల్ల: గ్రామాభివృద్ధి కోసం ప్రభుత్వ ఆదేశాలతో పల్లెల్లో అభివృద్ధి పనులు చేస్తే.. బిల్లులు ఇవ్వకుండా పది నెలలుగా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని తాజా మాజీ సర్పంచుల జేఏసీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ తాజా మాజీ సర్పంచులు సిరిసిల్లలో శుక్రవారం దీక్షలు చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి దీక్షల్లో కూర్చున్నారు. జిల్లా తాజా మాజీ సర్పంచుల జేఏసీ అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్ మాట్లాడుతూ తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. పది నెలలుగా ప్రభుత్వం తాజా మాజీ సర్పంచుల బిల్లులు విడుదల చేయకపోవడంతో అప్పుల బాధలు ఎక్కువ అయ్యాయన్నారు. ఇప్పటికే అనేక మంది సర్పంచులు అప్పుల బాధలతో ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో నిబంధనల మేరకు పనులు చేస్తే బిల్లుల ఇవ్వకుండా పెండింగ్‌లో ఉంచారని ఆరోపించారు. ఇప్పటికైనా బిల్లులు మంజూరు చేయాలని కోరారు. తాజా మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాట్ల మధు, జిల్లా ఉపాధ్యక్షులు గణప శివజ్యోతి, ప్రధాన కార్యదర్శి దుమ్మ అంజయ్య, కార్యదర్శులు కోల నర్సయ్య, ఏనుగుల కేశవరావు, గాండ్ల సుమతి, తాడెపు ఎల్లం, కె.వెంకటనర్సింహారెడ్డి, లక్ష్మణ్, గుగులోత్ జగన్‌నాయక్, మల్యాల దేవయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి మండలాల్లో దీక్షలు

పెండింగ్ బిల్లుల విడుదల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు జిల్లాలోని మండల కేంద్రాల్లోనూ తాజా మాజీ సర్పంచుల జేఏసీ దీక్షలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు శనివారం నుంచి 23 వరకు చందుర్తి, రుద్రంగి, కోనరావుపేటల్లో, అక్టోబరు 20 నుంచి 24 వరకు గంభీరావుపేట, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేటల్లో, 21 నుంచి 25 వరకు తంగళ్లపల్లి, ముస్తాబాద్, ఇల్లంతకుంటలో, 22 నుంచి 26 వరకు బోయినపల్లి, వేములవాడరూరల్, వేములవాడ అర్బన్‌లో దీక్షలు చేయాలని జేఏసీ నిర్ణయించింది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గంభీరావుపేట(సిరిసిల్ల): తాళం వేసిన ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. గంభీరావుపేట మండలంలోని ముస్తఫానగర్‌కు చెందిన కొరిపెల్లి నారాయణరావు గురువారం ఇంటికి తాళం వేసి, కుటుంబసభ్యులతో కలిసి ఊరెళ్లాడు. గురువారం రాత్రి దొంగలు తాళం పగులగొట్టి, బీరువాలోని మూడున్నర తులాల బంగారు ఆభరణాలతోపాటు రూ.8వేలు ఎత్తుకెళ్లారు. అలాగే, ఇంటి ఎదుట ఉన్న కారును ధ్వంసం చేశారు. పోలీసులు శుక్రవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.